ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర - చీపురుపల్లి: సచివాలయ ఉద్యోగుల సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని చీపురుపల్లి మండలం నిమ్మలవలస గ్రామ సర్పంచ్ అధికారుల ఉమాదేవి అన్నారు. నిమ్మలవలస గ్రామ సచివాలయం నుండి బదిలీపై వేరే ప్రాంతాలకు వెళుతున్న ఉద్యోగులను బుధవారం ఆమె ఘనంగా సన్మానించారు. ఉద్యోగులు రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని అవసరమైన పేద ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ అధికారుల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ టి.కృష్ణారావు, కార్యదర్శి పి.లక్ష్మి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన యువజన సర్వీసుల భవనం

- పెచ్చులూడుతున్న కార్యాలయం స్లాబు
- భయం..భయంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: ఒకప్పుడు ఎంతోమంది యువకుల్లో నాయకత్వ లక్షణాలు అలవర్చి నైపుణ్యవంతులుగా తీర్చిదిద్ది... ప్రతిభ ఉన్న వారిని వెలుగులోకి తెచ్చి.. ప్రతిభ లేని వారిని ప్రతిభావంతులుగా తయారు చేసి... ప్రయోగశాలగా వెలుగొందిన యువజన సర్వీసుల శాఖ నేడు దీనస్థితిలో కాలం గడుపుతుంది. కులం.. మతం చూడకుండా అర్హులైన యువతకు సబ్సీడీ రుణాలు మంజూరు చేసి వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేలా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించింది. ఆర్మీ రిక్రూట్‌మెంటు ర్యాలీలు, పోటీతత్వ పరీక్షలకు సంబంధించిన శిక్షణ తరగతులు, పలు విద్యా సంస్థల్లో వివిధ అంశాలపై అవగాహన సదస్సులు, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో యువజనోత్సవాలు నిర్వహించి యువతను సన్మార్గంలో నడిపించేందుకు తన వంతు పాత్ర పోషించిన అలాంటి శాఖ నేడు నిధుల లేమితో విధులకు దూరమై కళ తప్పింది. ఒక అధికారి, 20 మందికి పైగా ఉద్యోగులు, సిబ్బంది దీని పరిధిలో పనిచేసేవారు. ఇప్పుడు రెగ్యులర్ ఉద్యోగులు ఇద్దరు, ఇన్‌చార్జి హోదాలో సీఈవో ఒకరు, పొరుగు సేవల పరిధిలో మరో ముగ్గురు పనిచేస్తున్నారు.

రాష్ట్ర విభజనకు ముందు ఒక వెలుగు వెలిగింది. 2019 తరువాత నిస్తేజంలోకి వెళ్లిపోయింది. కార్యాక్రమాలు నిర్వహించేందుకు నిధులు రావడం ఆగిపోయాయి. ఒకప్పుడు ఈ విభాగంలో పనిచేసేందుకు పెద్ద ఎత్తున పోటీ పడేవారు. కానీ, నేడు ఇన్చార్జీగా కూడా ఎవరూ చేయదానికి ఆసక్తి చూపడం లేదు. 2014-19 సమయంలో యువతకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు రూ.5 కోట్లుతో యువ భవన్ నిర్మించాలని కేఎల్ పురంలోని, యువజన వసతి గృహం పక్కన స్థలం సైతం పరిశీలించారు. ఆ నిధులు సైతం విడుదలై మళ్ళీ వెనక్కి వెళ్లి పోయాయి. ఎన్నైకే కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఒక భవనంలో రైతు భరోసా కేంద్రం కొన్నాళ్లు, పర్యాటక శాఖ కొన్నాళ్లు, బాలల హక్కుల పరిరక్షణ విభాగం కొన్నాళ్లు నడిచాయి. ఇప్పుడు ఈ విభాగానికి తాళాలు వేసేశారు.

పెచ్చులూడుతున్నాయ్: సుమారు 20 ఏళ్ల కిందట ఈ భవనాన్ని నిర్మించారు. అప్పటి నుంచి దీని మరమ్మతులకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఫలితంగా ప్రస్తుతం భవనం పైకప్పు నుంచి పెచ్చులూడి వర్షం నీరు కిందికి పడుతుంది. ఏ సమయంలో ఏ పెచ్చు తల మీద పడుతుందోనన్న భయం ఉద్యోగుల్లో కనిపిస్తుంది. సీఈవో కార్యాలయంలో సైతం ఇదే పరిస్థితి ఉంది. పోని ఏమైనా మరమ్మతులు చేద్దామంటే కార్యాలయానికి సంబంధించిన బ్యాంక్ ఖాతాలో కేవలం రూ.1400 మాత్రమే బ్యాంక్ బ్యాలెన్సు కనిపిస్తుండటంతో ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులకు ఎన్ని లేఖలు రాసినా స్పందన కానరావడం లేదన్న వాదన వినిపిస్తుంది.

క్రీడలు, యువజన సర్వీసులు, పర్యాటకం.. మరికొన్ని విభాగాలను ఒక గొడుగు కిందకు తీసుకువస్తే మంచి ఫలితాలు వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. అయితే గతంలో 2014లో తెదేపా హయంలో క్రీడా విభాగాన్ని, యువజన సర్వీసుల విభాగాన్ని ఒక గొడుకు కిందకు తెచ్చి మళ్లీ విభజించారు. అందువల్ల ఆ ప్రయత్నం మళ్లీ జరగకపోవచ్చుననే వాదన వినిపిస్తుంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ముందుకు సాగుతున్నామని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఐఐటీలో మోహంతి కౌముది పాఠశాల విద్యార్థి సత్తా

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: ఇటీవల విడుదలైన ఐఐటి 2025 ప్రవేశ పరీక్షా ఫలితాలలో ఎస్.కోట కౌమది మహంతి పాఠశాల విద్యార్థిని పొలిమేర వర్షిని ఐఐటి నూజివీడుకు ఎంపికైంది. ఈ విషయంపై విద్యార్థిని వర్షినికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతి మోహంతి అభినందనలు తెలియజేశారు.

కలెక్టర్‌ను కలిసిన మాజీ కేంద్ర మంత్రి అశోక్

విశాలాంధ్ర - విజయనగరం: గోవా గవర్నర్‌గా పదవిని చేబట్టబోయే కేంద్ర మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు బుధవారం జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను కలెక్టర్ ఛాంబర్‌లో కలిశారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై ఇద్దరూ చర్చించారు. కార్పొరేషన్ పరిధిలోని పారిశుధ్యం, అభివృద్ధి కార్యక్రమాలపై కూడా మాట్లాడుకున్నారు. గోవా గవర్నర్‌గా నియమితులైనందుకు కలెక్టర్ అంబేద్కర్ అశోక్ గజపతి రాజుకు అభినందనలు తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన దివ్యాంగ విద్యార్థిని

విశాలాంధ్ర - బాడంగి: స్థానిక బాడంగి జడ్పీ పాఠశాలలో పదో తరగతి చదివి 448 మార్కులు సాధించి దివ్యాంగుల రిజర్వేషన్ కోటాలో నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రావణి ఆమె సోదరి ఇద్దరూ ఇంటలెక్చువల్ డిజబిలిటీ లోపం ఉన్నందున 5వ తరగతి వరకు పెదపదం గ్రామంలో చదివి

తరువాత దగ్గరలో ఉన్నత పాఠశాల లేనందున 4ఏళ్ళు ఏ పాఠశాలలో చేరలేదని, ఇద్దరూ డ్రాప్ అవుట్ అయ్యారని, తరువాత వారి కుటుంబ సభ్యులు మీడియా ద్వారా దివ్యాంగులకు కూడా ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక ఉపాధ్యాయులు ఉన్నారని తెలుసుకొని బాడంగి పాఠశాలలో వారి వయసుకు తగ్గట్టు ఆర్టీఈ చట్టం ద్వారా 8వ తరగతిలో డైరెక్ట్ అడ్మిషన్ పొందారన్నారు. దాని ఫలితంగా ఇద్దరు సోదరిలు శ్రావణి 448, విశాలాక్షి 381 మార్కులు సాధించిందని, శ్రావణి 448 మార్కులకు నూజివీడు ట్రిపుల్ ఐటీకి సెలెక్ట్ అయ్యిందన్నారు. శ్రావణిని,ఆమె ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావుని హెచ్ఎం దత్తి సత్యన్నారాయణ ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

బ్రిడ్జ్ పటిష్టంగానే ఉంది... గోడలు మాత్రమే నిర్మించాలి

రోడ్లు, భవనాలు శాఖ ఏఈ మీనాకుమారి

విశాలాంధ్ర - పూసపాటిరేగ: మండలంలో గోవిందపురం నుంచి జాతీయ రహదారికి వెళ్ళే రోడ్డులో పాలవలస కాలువను దాటుతూ ఒక వంతెన ఉంది. అది కొంతకాలంగా అధిక పొడవాటి లారీలు వాహనాలు వెళ్ళి వంతెనకు ఇరు పక్కల ఉన్న సపోర్ట్ గోడలు, గ్రిల్స్ పడిపోయాయి. ఈ మధ్య కాలంలో ఒక పొలానికి రోడ్డు నిమిత్తం కుమిలి కోరి నుంచి గ్రావెల్ టిప్పర్‌లతో తరలించారు. అప్పుడు అధిక వేగం, అధిక బరువు వల్ల పక్కన ఉన్న చిన్న చిన్న ప్లాస్టింగ్‌లు ఊడిపోవడంతో స్థానికులు భయపడి వంతెన శిథిలావస్థకు చేరిందని వెంటనే కొత్తది నిర్మించాలని డిమాండ్ చేశారు. కానీ రోడ్డు, భవనాలు శాఖ అధికారి మీనా కుమారి వంతెనను పరిశీలించి వంతెన శిథిలావస్థకు చేరలేదని చిన్న చిన్న మరమ్మతులు చేస్తే సరిపోతుందని, ఈ నెలలో గుత్తేదారుల ఎంపిక జరిగాక వంతెన మరమ్మతులు చేయిస్తామని, ఆ వంతెన మీద అందరూ ధైర్యంగా ప్రయాణించవచ్చని తెలిపారు.

కొత్తవలస పంచాయతీలో "నమస్తే" డే

విశాలాంధ్ర - కొత్తవలస: పారిశుద్ధ్య కార్మికుల కొరకు వారి రక్షణ, భద్రత, ఆరోగ్యం తదితర అంశాలపై వారిలో చైతన్యం కల్పించే దిశగా ప్రభుత్వం ఏటా జులై 16న నిర్వహించే నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఇకోసిస్టం డే సెలబ్రేషన్స్ బుధవారం కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు రక్షణ కిట్లు, దుస్తులను అందజేశారు. అలాగే వైద్య శిభిరం ఏర్పాటుచేసి ఆరోగ్య తనిఖీలు చేపట్టి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ శైలజ, సచివాలయ కార్యదర్శి గోపి, శానిటరీ మేస్త్రి ప్రసాద్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

విశాలాంధ్ర - రామభద్రపురం: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని బొబ్బిలి శాసనసభ్యులు బేబీ నాయన అన్నారు. బుధవారం మండలంలోని శిష్టు సీతారాంపురం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు గురించి స్థానికులకు వివరించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలలో భాగంగా పింఛన్ల పంపిణీ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, ఆగస్టు 15 నుంచి ఉచిత బస్ సర్వీసు తదితర పథకాలు అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు విజయభాస్కర్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మామిడి వలస ఎంపిటిసి మడక తిరుపతి నాయుడు, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు కరోతి తిరుపతిరావు, ఆ గ్రామ సర్పంచ్ వెంకన్న, రామభద్రపురం ఎంపీటీసీ బైరెడ్డి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శిలను వెంటనే రిజిస్టర్ చేయాలి

కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర - విజయనగరం: పి 4 క్రింద పేదలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శిలను గుర్తించి వెంటనే రిజిస్టర్ చేయించాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. సర్వేలో పేదలకు ఏ అవసరాలు ఉన్నాయో గుర్తించి వారికి తగ్గ మార్గదర్శిలకు టాగ్ చేయాలని, చిన్న చిన్న అవసరాలకు చిన్న మార్గ దర్శిలే సరిపోతారని, వెంటనే వారిని గుర్తించాలని సూచించారు. బుధవారం కలెక్టర్ వెబెక్స్ ద్వారా పి 4, స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర, ఎరువుల సరఫరా, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై జిల్లా స్థాయి, మండల అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. వచ్చే 3వ శనివారం ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం అనే నినాదంతో కార్యక్రమాలు చేయాలన్నారు. జిల్లాలో వర్షాలు అధికంగా కురుస్తున్నం దున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, అన్ని ఆర్.ఎస్.కేలలో సరిపడే ఎరువులను సిద్ధంగా ఉంచడం జరిగిందని, అదే విధంగా పాక్స్‌లోనూ, ప్రైవేటు డీలర్ల వద్ద కూడా ఎరువులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది అదనంగా బొబ్బిలి, విజయనగరంలలో డి.సి.ఎం.ఎస్ గొడౌన్లలో కూడా ఎరువులను ఉంచడం జరిగిందని తెలిపారు. ప్రైవేటు దుకాణాలలో ఎరువుల ధరలపై నిఘా ఉంచాలని, ఎక్కడైనా నిర్దేశిత ధర కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం క్రింద మండల వారీగా లబ్ధిదారులను వెరిఫై చేసి అర్హులైన వారి జాబితాలను సిద్ధం చేయాలని తహశీల్దార్‌లకు ఆదేశించారు.

హామీలు అమలు చేసిన ఘనత సీఎందే: ఎమ్మెల్యే కోళ్ల

విశాలాంధ్ర - వేపాడ: నాడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ హామీలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్నారని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ళ లలిత అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వేపాడ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించి ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు పథకాలను వివరించారు. రానున్న సంస్థాగత ఎన్నికల్లో గ్రామాల్లో సర్పంచులను, ఎంపీటీసీలను, టీడీపీ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాల అభివృద్ధితో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గోంప వెంకటరావు, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి లక్ష్మి, ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పోతల వెంకట రమణ, టిడిపి నాయకులు, నిరుజోగి దాలినాయుడు, బోజంకి లక్ష్మణరావు, నిరుజోగి బంగారునాయుడు, గుంటపల్లి దేముడు నాయుడు, చల్లా వెంకటరావు, నిరుజోగి అమ్మతల్లినాయుడు, కోటాన అప్పలనాయుడు, నాగిరెడ్డి ముత్యాల నాయుడు, కోన సత్యం, జి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన రిటైర్డ్ డీజీపీ, ఆర్టీసీ ఎం.డి. సీహెచ్.ద్వారక తిరుమలరావు పోలీసు గెస్ట్ హౌస్‌కు విచ్చేసిన సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మర్యాదపూర్వకంగా కలిసి, పూలమొక్కను అందజేశారు.

విశాలాంధ్ర - విజయనగరం టౌన్:

క్లాప్ మిత్రలకు ఆరోగ్య తనిఖీలు

విశాలాంధ్ర - జామి: మండలంలోని అన్నంరాజుపేట పంచాయతీలో క్లాప్ మిత్రలకు పంచాయతీ కార్యదర్శి జగదీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించి ఆరోగ్య తనిఖీలను చేపట్టారు. నిత్యం గ్రామాలలో పారిశుధ్య నివారణా చర్యలలో పాల్గొనే పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణ పంచాయతీ బాధ్యత అని జగదీష్ అన్నారు. చెత్తనుంచి సంపద తయారీ కేంద్రానికి అవసరమైన చెత్తను తరలిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో ఎఎన్ఎం బి.దేముడమ్మ, ఎంఎల్‌హెచ్‌పి డి. పద్మాదేవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - గుర్ల: మండలంలో గుజ్జింగి వలసలో మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ పొట్నూరు ప్రమీల బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేత కె.వి.సూర్యనారాయణ రాజు, బెల్లాన బంగారు నాయుడు, జడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైసీపీ రాష్ట్ర ఆర్టిఐ వింగ్ కార్యదర్శి కెంగువ మధుసూదన్‌రావు, సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీ సంధ్యారాణి, స్థానిక నాయకులు అప్పలరాజు, అప్పల నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ క్షేత్ర సహాయకులకు వేతనాలు చెల్లించండి

విశాలాంధ్ర - భోగాపురం: ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న క్షేత్ర సహాయకులకు వేతనాలు అందక అర్ధాకలితో అవస్థ పడుతున్నారు. గత మూడు నెలలు జీతాలు అందక ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని, ఈ సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేసి జీతాలు ఇప్పించడానికి కృషి చేయాల్సిందిగా మండల పరిషత్ కార్యాలయం పరిపాలన అధికారి కామేశ్వరరావుకు బుధవారం క్షేత్ర సహాయకులు వినతి పత్రం అందించారు. అధికారులు సూచించిన ప్రతి పనిని సమర్థవంతంగా నిర్వహిస్తూన్నామని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేస్తున్న మాకు మూడు నెలలుగా జీతాలు రాకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సియాద్రి రాజారావు, ద్వారపురెడ్డి అచ్యుతరావు, అడ్డగర్ల త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు హామీలతో గెలిచిన కూటమి

మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

విశాలాంధ్ర - డెంకాడ: ప్రజలకు తప్పుడు హామీలు ఇచ్చి కూటమి ప్రభుత్వం గద్దినెక్కిందని నెల్లిమర్ల నియోజవర్గ మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. బుధవారం డి.తాళ్లవలస, చిట్టిగుంకల, రఘుమండ, తమ్మాపురం, గంట్ల గ్రామాల్లో బాబు షూరిటీ - మోసం గ్యారంటీ రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బడ్డుకొండ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన 14 నెలలు దాటిన ప్రజలకు చేసిన మేలేమి లేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే గ్రామ గ్రామానికి తిరిగి 100 రోజుల్లో 100 కంపెనీలు తెస్తామని నియోజక వర్గాన్ని సింగపూర్‌గా మారుస్తామని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు కానీ ఇప్పటివరకు ఏ కంపెనీలు తేలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పిన్నింటి తమ్మునాయుడు, నియోజకవర్గ యువజన అధ్యక్షులు కరుమజ్జి త్రినాధ్, పార్టీ కార్యవర్గ సభ్యులు ఎల్.లక్ష్మణరావు, అంగనవాడి అధ్యక్షురాలు పతివాడ కృష్ణవేణి, జొన్నాడ సర్పంచ్ ప్రతినిధి కోరాడ కోటి నాయుడు, చొల్లంగిపేట సర్పంచ్ కనకరాజు, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాను శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గిరిజనులే తొలి స్వాతంత్ర్య సమరయోధులు పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఆంధ్ర వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్ అధ్వర్యంలో సంకలనం చేసిన గిరిజనులే తొలి స్వాతంత్ర్య సమరయోధులు అనే పుస్తకాన్ని కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయ ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ప్రొ. తంత్రవాహి శ్రీనివాసన్, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొ. జితేంద్ర మోహన్ మిశ్రాలు సంయుక్తంగా ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొ. శ్రీనివాసన్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరంలో గిరిజనుల సహకారం ఎంతైనా ఉందని భారతదేశంలో పౌరులు నేడు స్వేచ్ఛా స్వాతంత్రాలతో ఉన్నారంటే దానికొరకు తమ ప్రాణాన్నే పణంగా పెట్టిన స్వతంత్ర సమర యోధుల త్యాగాన్ని మనము ఎప్పటికీ మరచిపో రాదన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న రాంజీ గోడు, భాగోజీ నాయక్, ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్ నుంచి గంగంటం దొర, చంద్రయ్య దొర, లక్ష్మణ్ నాయక్ తదితరుల కృషి మారువలేనిదని కొనియాడారు. ఈ పుస్తకం గిరిజనుల చరిత్ర, ధైర్యం, త్యాగాలను ప్రతిబింబించడంతో పాటు, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ. జితేంద్ర మోహన్ మిశ్రా, ఆంధ్ర వనవాసి కల్యాణ ఆశ్రమ జిల్లా అధ్యక్షుడు గీతారెడ్డి, సెక్రటరీ డా. దాసరి నారాయణ, నగర అధ్యక్షులు డా. ఎన్.వి.ఎస్.సూర్య నారాయణ, యూనివర్సిటీ లైబ్రేరియన్ డా. శంకర రెడ్డి కొల్లే తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను పరిశీలించిన టిడ్కో చైర్మన్

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: సాలూరు నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాలను టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అసంపూర్తిగా ఉన్న గృహాల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి, లబ్ధిదారులకు అన్ని సౌకర్యాలతో కూడిన ఇళ్లను త్వరితగతిన అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాలవలస యశస్వి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు. అంతకు ముందు విజయనగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గృహ నిర్మాణాల పురోగతి, టిడ్కో ప్రాజెక్టుల అమలుపై మీడియాకు వివరాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయనగరం నియోజకవర్గం టౌన్, మండల నాయకులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై బైక్ ర్యాలీ

విశాలాంధ్ర - రాజాం: రాజాం న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం న్యాయ సేవా సంస్థ అధ్యక్షులు, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కె.శారదాంబ అధ్వర్యంలో స్థానిక కోర్ట్ ఆవరణ నుండి అంబేద్కర్ జంక్షన్ వరకు కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులలో మధ్యవర్తిత్వం వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు తెలియజేసే నిమిత్తం బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో రాజాం సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) కుమారి కె.నైమిష, రాజాం బార్ అసోసియేషన్ నుండి వైస్ ప్రెసిడెంట్ ఎస్.మురళీధరరావు, సెక్రెటరీ బి.తిరుపతి నాయుడు, ప్రభుత్వ న్యాయవాది పి.శ్రీనివాస్, ఎక్స్-ప్రెసిడెంట్ కె.రామినాయుడు, ఎక్స్-ఏజీపి ఎస్.పోలారావు, సీనియర్ న్యాయవాదులు వై.ఎస్.శ్రీనివాస్, ఆర్.విజయ కుమార్, ఐ.శ్రీరాములు నాయుడు, సి.హెచ్.శంకరరావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్ దృష్టికి సంతపాలెం దళితుల భూ సమస్య

విశాలాంధ్ర - కొత్తవలస : విజయనగరం జిల్లా కొత్తవలస మండలం, సంతపాలెం గ్రామంలో ప్రభుత్వం దళితుల అభ్యున్నటికీ మంజూరుచేసిన డీపట్టా భూములను కొంతమంది అగ్రకులస్తులు భూకబ్జాలకు పాల్పడటం, అలాగే తప్పుడు పాసుపుస్తకాలను సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్‌లకు పాల్పడ్డారని హైకోర్టు న్యాయవాది యల్లపు రామచైతన్య మరికొంతమంది ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్ దృష్టికి తీసుకెళ్లినట్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ గా ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన జవహర్ ను విజయవాడలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసామన్నారు. సంతపాలెంలో అమాయకులైన దళితులను మోసం చేసి కొట్లాది రూపాయల భూములను కాజేసే ప్రయత్నం చేస్తున్న అక్రమార్కులు, వారికి సహకరించిన రెవిన్యూ అధికారులతో పాటూ అక్రమార్జనకు ఒడిగట్టిన దళారులను సైతం శిక్షించాలని, వారిపై కఠిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసామని పేర్కొన్నారు. అలాగే భోగాపురం మండలంలో దళితులపై జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలపై కూడా జవహర్ దృష్టికి తీసుకెళ్లినట్లు లేఖలో తెలిపారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలోనే వీటన్నిటిపై చర్యలు తీసుకునేలా చూస్తానని చెప్పారన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా ఆర్టీసీ ఉద్యోగుల జై భీమ్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ యల్లపు రాంబాబు, చెరుకుపల్లి గ్రామ నాయకులు గురుమూర్తి, రిక్క నర్సింగరావు తదితరులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

విశాలాంధ్ర - భోగాపురం : మండలంలోని పోలిపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ కుమారి అనూష రెడ్డి అధ్యక్షతన బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పిహెచ్సి అభివృద్ధి గురించి డాక్టర్లు సిబ్బందితో చర్చించారు. వైద్య సేవలు గురించి అడిగి తెలుసు కున్నారు. ఆస్పత్రిలో అందిస్తున్న కాన్సర్ పరీక్షలు గురించి ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. స్టాప్ డయేరియా క్యాంపైన్,ఎనిమియా క్యాంపైన్ ల గురించి అరా తీశారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో, అధ్యక్షుల సలహాదారు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, తహశీల్దార్ ఎం.రమణమ్మ, కమిటీ సభ్యులు పోలిపల్లి సర్పంచ్ కర్రోతు వెంకట రమణ, రాజపులోవ సర్పంచ్ కిలారి స్వప్న, మెడికల్ ఆఫీసర్ డాక్టర్.దివ్య, డాక్టర్లు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారుడు బొండపల్లి రమేష్‌కు సన్మానం

విశాలాంధ్ర - బొబ్బిలి: పట్టణంలోని అగురు వీధికి చెందిన

క్రీడాకారుడు బొండపల్లి రమేష్ ఢిల్లీలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీలలో పాల్గొని, జూనియర్ క్లాసిక్ ఫిజిక్ విభాగంలో 4వ స్థానం, జూనియర్ మెన్ ఫిజిక్ విభాగంలో 5వ స్థానం సాధించినందున బుధవారం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఆర్. రాంబర్కి శరత్ ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ శరత్ బాబు మాట్లాడుతూ ముందు ముందు ఇంకా మరెన్నో పోటీలలో పాల్గొని, మంచి మంచి విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ వెలగాడ హైమావతి, 6వ వార్డు కౌన్సిలర్ ఎస్.సాయి రమేష్, 13వ వార్డు ఇన్‌చార్జ్ బి.శివ, 16వ వార్డు ఇన్‌చార్జి ఆర్.భాను, 5వ వార్డు ప్రతినిధి వెలగాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సోమలింగాపురం పీఏసీఎస్ చైర్మన్‌గా వెంకటపతిరాజు

విశాలాంధ్ర - మెరకముడిదాం: రాజకీయ చాతుర్యంతో క్రియాశీలక రాజకీయాల్లో చురుకుగా ఉన్న శిరివూరు వెంకటపతి రాజును (నాని) సోమలింగాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. అలాగే వెంకటపతి రాజు (నాని) రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం కావడంతో ప్రజలకు, రైతులకు మెరుగైన సేవలు అందిస్తారని సొసైటీ పరిధిలో గ్రామాల రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. వెంకటపతి రాజు నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఆక్రమణల గుర్తింపుపై ప్రణాళిక

విశాలాంధ్ర - విజయనగరం: నగరంలో చెరువుల చుట్టూ ఉన్న ఆక్రమణలను గుర్తించే ప్రక్రియను విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రణాళిక సిబ్బంది చేపట్టారు. బుధవారం అనేక చెరువుల వద్దకు చేరుకున్న ప్రణాళిక సిబ్బంది చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు, తాత్కాలిక ఏర్పాట్లను పరిశీలించి కొలతలను తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగరంలో ఉన్న చెరువులను ఆక్రమించి ఎటువంటి నిర్మాణాలను చేపట్టరాదని ప్రజలకు సూచించారు. ఇప్పటికే ఉన్న నిర్మాణాలు, తాత్కాలిక ఏర్పాట్లను గుర్తించామన్నారు. వాటికి అవసరమైన కొలతలను తీసుకోవాలని ప్రణాళిక సిబ్బందికి ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో టిపిఓ అప్పలరాజు, ప్రణాళిక కార్యదర్శులు పాల్గొన్నారు.

మెరుగైన పౌర సేవలందించాలి

విశాలాంధ్ర - విజయనగరం: ప్రభుత్వ మార్గదర్శకాలను అమలు చేస్తూ మెరుగైన పౌర సేవలను మరింతగా అందించేందుకు కృషి చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు.పుర మిత్ర యాప్ నిక్షిప్తం, టిడ్కో గృహ సముదాయాల మౌలిక సదుపాయాలు, పన్నుల వసూళ్లు, వీధివిక్రయదారుల సర్వే, పందుల సంచారాన్ని అరికట్టడానికి తీసుకోవలసిన చర్యలు, వీధి కుక్కలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించడం వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. పన్నులు వసూళ్ళలో వృద్ధిరేటు సాధించినప్పటికీ శతశాతం పన్ను వసూలే ధ్యేయంగా కృషి చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కమిషనర్ పల్లి నల్లనయ్య, ప్రజారోగ్య అధికారి డా. కొండపల్లి సాంబమూర్తి,ఈఈ ప్రసాద్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఆర్ఓ సింహాచలం పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ యూత్ స్కిల్స్ డే

విశాలాంధ్ర - వేపాడ: మండల కేంద్రమైన వేపాడ శివారు బక్కు నాయుడుపేటలో గల ఆదర్శ పాఠశాలలో వరల్డ్ యూత్ స్కిల్స్ డే వేడుకలు పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ విజయ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రపంచ యువ నైపుణ్యాల గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే యువతను ఉత్తమ భవిష్యత్తుకు సిద్ధం చేయడంలో సాంకేతిక శిక్షణ యొక్క పాత్రను గుర్తించడానికి 15 జూలై 2014న, ఐక్యరాజ్యసమితి, అసెంబ్లీ, యువతకు నైపుణ్య దినోత్సవం ఏర్పాటు చేసిందన్నారు. అలాగే ఐటి, ఐటిఎస్, ఆపేరేల్ వృత్తి ఉపాధ్యాయులు జగదీష్ దేవిలు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి వృత్తివిద్య కోర్సుల ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్ కాంపిటీషన్, చిత్రలేఖనం, పోటీలను నిర్వహించి వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల దుఖాణంలో విజిలెన్సు తనిఖీలు

విశాలాంధ్ర-జామి: మండలంలోని వెంకటకృష్ణ ఎరువుల దుఖాణంలో బుధవారం విజిలెన్సు అధికారులు, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. విజిలెన్సు సిఐ టి. అప్పలనాయుడు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎం.రామారావు, మండల వ్యవసాయాధికారి ఎం.పూర్ణిమలు దుఖాణంలోని ఎరువుల నిల్వలను, రికార్డులను, అనుమతులును తనికీ చేసారు. అలాగే పురుగుల మందుల నిల్వలను తనికీ చేసారు. ధరలను నిర్దేశించిన మేరకు అమ్మకాలు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి పి.కూర్మారావు, షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జాగరంలో రెండు రోజులుగా కుళాయిలు బంద్

విశాలాంధ్ర-జామి: మండలంలోని జాగరం గ్రామంలో రెండు రోజులుగా కుళాయిలనుంచి తాగునీరు రావడంలేదు. ఎటువంటి సాంకేతిక అంతరాయం లేకపోయినా కేవలం పంచాయతీ నిర్లక్ష్యం కారణంగా తాగునీరు సరఫరా కాలేదని తెలిసింది. గ్రామంలోని కొలాయిలకు నీరు వదిలే పంపు ఆపరేటర్ సబ్బవరపు శివకు 10 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురైన శివ విధుల్లోకి రావడం మానేసి నిరసన వ్యక్తం చేసాడు. దీంతో ఈనెల 15నుంచి గ్రామంలో కుళాయిల ద్వారా తాగునీరు ప్రజలకు అందడం లేదు. దీనిపై గ్రామ సర్పంచ్ వసి పార్వతి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు పంపు ఆపరేటర్ వేతనాలను చెల్లించాలని తెలియజేసినా నిర్లక్ష్యంతో పట్టించుకోలేదని ఆరోపించారు. అతనితోపాటు గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలను ఇచ్చేందుకు కార్యదర్శి సహకరించడం లేదని తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

విశాలాంధ్ర - జామి: మండలంలోని కుమరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విదులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన బదిలీలలో వెళ్ళిపోయిన 9 మంది ఉపాధ్యాయులకు బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. పాఠశాల నుంచి బదిలీ అయిన హెచ్ఎం చిట్టి పద్మావతి, ఈశ్వరరావు, రమణ, శర్మ, ఎన్.పద్మావతి, బి.పద్మావతి, వరలక్ష్మి, రమాదేవి, పిఇటి శ్రీనివాస్ ప్రస్తుత హెచ్ఎం బాబూలాల్ ఆధ్వర్యంలో సిబ్బంది అంతా కలిసి ఘనంగా సత్కరించారు. అలాగే కొత్తగా పాఠశాలకు వచ్చిన 13మంది ఉపాధ్యాయులను సైతం స్వాగతం పలికి వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుండాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోట ప్రధాన రహదారి జలదిగ్బంధం

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: ఎస్.కోట పట్టణంలో బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి అరకు విశాఖపట్నం ప్రధాన రహదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి రైతుబజార్ వరకు రోడ్డుపై నీరు నిలిచిపోయింది దీంతో వాహన దారులు ఇక్కట్లుకు గురయ్యారు సాయంత్రం వేళల్లో కళాశాలలో పాఠశాలలు విడిచి పెట్టే సమయానికి రోడ్లపై నీరు చేరడంతో మహిళలు, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు రోడ్లపై నిలిచిపోయిన నీటి ప్రవాహంలో రాలేక పలు ఇబ్బందులకు గురయ్యారు. తగిన పంచాయతీ అధికారులు జోక్యం చేసుకొని వర్షపు నీరు సజావుగా చెరువులోకి పోయే విధంగా చర్యలు చేపడతారని పలువురు కోరుకుంటున్నారు.

అశోక్‌ను సత్కరించిన హెూటల్ అసోషియేషన్ ప్రతినిధులు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన మాజీ కేంద్రమంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజును బుధవారం విజయనగరం జిల్లా హెూటల్ అసోషియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. స్థానిక అశోక్ బంగ్లాకు వచ్చిన అసోషియేషన్ సభ్యులంతా కలిసి జిల్లా అధ్యక్షుడు జి. శ్రీనివాసరావు, కార్యదర్శులు పి. వాసు, నవీన్‌ల ఆధ్వర్యంలో అశోక్ గజపతిరాజును దుశ్శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా అశోక్‌కు సభ్యులంతా కలిసి అభినందనలు తెలిపారు. రాజకీయాలలో అందరికీ ఆదర్శంగా నిలిచి, ప్రజాసేవలో తనకంటూ ఒక గుర్తింపును తెచ్చుకున్న అశోక్‌కు గవర్నర్ పదవి రావడంపై సంతోషంగా ఉందని, ఆయనకు పదవి రావడం విజయనగరం వాసులుగా మేమెంతో సంతోషిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో అసోషియేషన్ సభ్యులు కాళ్ళ సునీల్, సుబ్బయ్య కిరణ్, చైతన్య, కొల్లి కోటేశ్వరరావు, సరిత, అబ్బులు, స్టార్ బిర్యానీ మహ్మద్ హాకీతుల్లా, ఉమా మహేశ్వరరావు, అవినాష్, వర్మ, తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరు నిందితుల అరెస్టు

విశాలాంధ్ర - డెంకాడ: విజయనగరం జిల్లా డెంకాడ మండలం, చింతలవలస 5వ బెటాలియన్ గేటు సమీపంలో మారుతి 800 కారులో ఒడిస్సా రాష్ట్రం నుండి విశాఖ తరలిస్తున్న 37.550 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు, పరారీ అయిన మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. డెంకాడ సర్కిల్ ఆఫీసులో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతి సుజికి 800 కారు ఒఆర్ 02 కే 7523 కారులో వస్తున్న ఇద్దరు వ్యక్తులు (ఎ-1) కోరాపుట్ జిల్లా నందాపూర్ బ్లాక్, రైజింగు పంచాయతీ, కతబర గ్రామానికి చెందిన బసుదేవ్ సిసా అలియాస్ భాస్కర్ గొల్లారి (22సం.లు) (ఎ-2), కోరాపుట్ జిల్లా పొట్టంగి బ్లాక్, చందక గ్రామానికి చెందిన అజయ్ గుంట (19సం.లు) అనే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, కారులోని 37.550 కిలోల గంజాయి, మారుతీ కారును సీజ్ చేసారన్నారు. పట్టుబడిన నిందితులను విచారణ చేయగా వారికి ముందు పైలట్‌గా మరో నిందితుడు (ఎ-3) రాజేష్ అలియాస్ గణేష్ అనే వ్యక్తి వెళ్ళినట్లు, సదరు వ్యక్తి తమను గంజాయిని తరలించేందుకు ఒప్పందం కుదిర్చినట్లు, అందుకు తమకు ఒక్కొక్కరికి రూ. 5వేలు ఇచ్చినట్లుగా వెల్లడించారన్నారు. పరారైనన నిందితుడు రాజేష్ అలియాస్ గణేష్‌ను అరెస్టు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, భోగాపురం సిఐ జి.రామకృష్ణ, డెంకాడ ఎస్ఐ ఎ.సన్యాసి నాయుడు, ఈగల్ బృందాన్ని మరియు ఇతర పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు.

సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌ను ముట్టడించిన విద్యార్థులు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు వేలాదిగా కాంప్లెక్స్ నుండి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకొని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కే ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయి నాలుగు నెలలు కావస్తున్న ఇప్పటివరకు అడ్మిషన్లు నిర్వహించకపోవడం ప్రభుత్వం యొక్క చేతకాని తనానికి నిదర్శనమని విమర్శించారు. తక్షణమే ఆఫ్లైన్ విధానంలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం డిగ్రీ విద్యార్థులకు దాదాపుగా 3,600 కోట్ల రూపాయల పెండింగ్ పెట్టిందని, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్న మరో 3,600 కోట్ల రూపాయలు పెండింగ్ పెట్టిందని, దీనిపై ఎస్ఎఫ్ఐ దశల వారీగా పోరాటం చేస్తే ఇప్పటివరకు 1200 కోట్ల రూపాయలు మాత్రమే రిలీజ్ చేశారని మిగిలిన 6000 కోట్ల రూపాయల పెండింగ్ నిధులు ఎప్పుడు విడుదల చేస్తారని విమర్శించారు. తక్షణమే పెండింగ్లో ఉన్న 6000 కోట్ల రూపాయల స్కాలర్షిప్స్ డిగ్రీ విద్యార్థులకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు పీజీ విద్య చదవాలంటే స్కాలర్షిప్ రాకుండా గత ప్రభుత్వం జీవో నెంబర్ 77 అనే నిరంకుశ జీవోను తీసుకొచ్చిందని వెంటనే రద్దు చేయాలని అన్నారు. ఆందోళనకు మద్దతు తెలిపిన యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కోరెడ్ల విజయ గౌరీ మాట్లాడుతూ న్యాయబద్ధమైన విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు, జె.రవికుమార్, ఎస్.సమీరా, ఎం.వెంకీ, పి.రమేష్, సహాయ కార్యదర్శులు శిరీష, రాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సిఐ శ్రీనివాస్ బదిలీతీరుతో పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బతీసింది

విశాలాంధ్ర - విజయనగరం రూరల్: విజయనగరం పట్టణ వన్ టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ ని పోలీసు శాఖ ఉన్నత అధికారులు బదిలీ చేసిన తీరుపై పోలీసు శాఖలో ప్రజల్లో విమర్శలు వినిపిస్తున్నాయని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ దృష్టికి తీసుకు వచ్చారు. బుధవారం ఎస్పీని కలిసి బదిలీ వెనుక జరిగిన పరిణామాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ విలేకరులతో మాట్లాడుతూ వన్ టౌన్ సిఐ శ్రీనివాస్ విదినిర్వహణలో నిబంధనల మేరకు వ్యవహరించకపోతే తగిన చర్యలు తీసుకునే అధికారం ఉన్నత అధికారులకు ఉందని దానిని ఎవ్వరూ కాదని అనలేరని, సిఐ శ్రీనివాస్ వలన అత్యవసరంగా జిల్లాకి రాష్ట్రానికి పెను ప్రమాదం సంభవించినట్టు రాత్రికి రాత్రే బదిలీ చెయ్యాల్సిన అవసరం కనిపించలేదని, ప్రాథమిక దర్యాప్తు లేకుండా ఏమి జరిగిందో తెలుసుకోకుండా నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఈ విషయమై రాష్ట్ర స్థాయి పోలీసు ఉన్నతాధికారులు ఆలోచించాలని జిల్లా ఎస్పీని కోరినట్లు భీశెట్టి తెలిపారు.

పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసేందుకే ఆరోగ్య తనిఖీలు

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న పోలీసు ఉద్యోగులు, హెూంగార్డ్సు ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, అప్రమత్తం చేసేందుకు రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, ఐపీఎస్ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది. హెూంగార్డ్సు , ఇతర ఉద్యోగులు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోక పోవడం వలన వారిలో ఆరోగ్య సమస్యలను గుర్తించక అర్ధంతరంగా అస్వస్థతతకు గురికావడం, మృతి చెందడం జరుగుతుందన్నారు. ఇటీవల కాలంలో ఈ సమస్య మరింత తీవ్ర రూపందాల్చిన కారణంగా జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న కొంతమంది ఉద్యోగులు చిన్న వయస్సులోనే అర్ధాంతరంగా మృత్యువాత పడ్డారన్నారు. ఈ తరహా సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు పోలీసు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లా పోలీసు శాఖలో పని చేస్తున్న పైస్థాయి అధికారుల నుండి హెూంగార్డు వరకు, మినిస్టీరియల్ సిబ్బందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన చికిత్స అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లా పోలీసుశాఖలో పని చేస్తున్న సిబ్బందికి ఈ మాసాంతరంలోగా వైద్య పరీక్షలు పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించామని, పోలీసు ఉద్యోగులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు. పోలీసు ఉద్యోగుల సౌలభ్యం కోసం జిల్లా కేంద్రంలోని మెడికవర్, స్కాన్యూ టేజ్లోను, బొబ్బిలిలోని క్వీన్ ఎన్.ఆర్.ఐ., రాజాంలోని జి. ఎం. ఆర్. వరలక్ష్మి కేర్ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పి.సౌమ్యలత, అదనపు ఎస్పీ (ఎఆర్) జి.నాగేశ్వరరావు, తిరుమల మెడికవర్ సెంట్రల్ హెడ్ డాక్టర్ మల్లికార్జున రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అఖిల్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రాజేష్, విజయనగరం స్కాన్యు ఎండి వి.గోవర్ధన్, మేనేజర్ సిరి కృష్ణ మరియు ఆసుపత్రి సిబ్బంది, ఎఆర్ డిఎస్పీ వై.రవీంద్ర రెడ్డి, ఎస్బి సిఐ ఎ.వి. లీలారావు, ఆర్ఐలు ఎన్. గోపాల నాయుడు, ఆర్.రమేష్ కుమార్, టి.శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయల్ ఎన్ఫీల్డ్ మోటారు సైకిళ్ళ చోరీకి పాల్పడిన నిందితులు అరెస్టు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: విజయనగరం 1, 2వ పట్టణ పోలీసు స్టేషను పరిధిలో రాయల్ ఎన్ఫీల్డ్ మోటారు సైకిళ్ళనుఅపహరించిన పాత నేరస్థుడు (ఎ-1) విజయనగరం పట్టణం, వి.టి. అగ్రహారం, బిసి కాలనీలో నివాసం ఉంటున్న ఉప్పడాల రాము అలియాస్ డిజే ను, దొంగిలించిన మోటారు సైకిళ్ళను విక్రయించడంలో సహాయపడిన (ఎ-2) ఆమదాలవలస మండలం ముద్దాడపేటకు చెందిన ముద్దాడ నవీన్ అలియాస్ టైసన్ (19సం.లు)ను అరెస్టు చేసి, వారివద్ద నుండి 11రాయల్ ఎన్ఫీల్డ్ మోటారు సైకిళ్లను, 2 యమహా ఆర్ 15 మోటారు సైకిళ్ళను రికవరీ చేసినట్లుగా 1వ పట్టణ పోలీసు స్టేషనులో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడించారు.ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ విజయనగరం 1వ, 2వ పట్టణ పోలీసుస్టేషను పరిధిలో రాయల్ ఎన్ఫీల్డ్ మోటారు సైకిళ్ళు చోరీకి గురవుతున్నాయని, వీటికి కారకులైన వారిని అరెస్టు చేసేందుకు నిఘా పెట్టామన్నారు. ఇందులో భాగంగా 1వ పట్టణ పోలీసు స్టేషను పరిధిలో సస్పెక్ట్ షీటు కలిగిన తోటపాలెం, వైఎస్ఆర్ నగర్కు చెంది, ప్రస్తుతం విటి అగ్రహారం బిసి కాలనీలో నివాసం ఉంటున్న (ఎ-1) ఉప్పడాల రాము అలియాస్ డిజేను అరెస్టు చేసామన్నారు. గతంలో కూడా ఉప్పడాల రాము అలియాస్ డిజేపై బైకు చోరీలకు పాల్పడినట్లుగా పలు కేసులున్నాయన్నారు. నిందితుడు రాము ఇటీవల జైలు నుండి విడుదలైన తరువాత మళ్ళీ బైకు చోరీలకు పాల్పడ్డారన్నారు. ఎ-1 ఉప్పడాల రాము వద్ద నుండి 7 మోటారు సైకిళ్ళను, ఎ-2 ముద్దాడ నవీన్ వద్ద నుండి 6 మోటారు సైకిళ్ళను రికవరీ చేసామన్నారు. రికవరీ చేసిన మోటారు సైకిళ్ళ విలువ రూ. 26లక్షలుఉంటుందన్నారు. ఉప్పడాల రాము చోరీ చేసిన మోటారు సైకిళ్ళను శ్రీకాకుళం జిల్లా ఆముదావలసకు తీసుకొని వెళ్ళి, అక్కడ ఎ-2 ముద్దాడ నవీన్ సహకారంతో విక్రయించే వాడన్నారు. 1వ పట్టణ పోలీసు స్టేషనుకు చెందిన 10 కేసుల్లో 8 రాయల్ ఎన్ఫీల్డ్, 2 యమహా ఆర్ 15 బైకులుకాగా, 2వ పట్టణ పోలీసు స్టేషనుకు చెందిన మూడు కేసుల్లో మూడు రాయల్ ఎన్ఫీల్డ్ మోటారు సైకిళ్ళు ఉన్నాయన్నారు. వీటిని కోర్టు ఆదేశాలతో బాధితులకు తిరిగి అందించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఎ-1 ఉప్పడాల రాము అలియాస్ డిజేను ఆర్టీసి కాంప్లెక్సు వద్ద రాయల్ ఎన్ఫీల్డ్ మోటారు సైకిలుతో అరెస్టు చేసినట్లు, విచారణలో అతడు ఇచ్చిన సమాచారంతో మిగిలిన బైకులను, ఎ-2 ముద్దాడ నవీన్ ను అరెస్టు చేసామని తెలిపారు. ఈ కేసులో క్రియాశీలకంగా విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సిఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి ఆధ్వర్యంలో పని చేసిన 1వ పట్టణ ఎస్ఐ సురేంద్ర నాయుడు, హెచ్సీ ఎ.రమణారావు, కానిస్టేబుళ్ళు ఎన్.గౌరీశంకర్, పి.శివశంకర్, టి.శ్రీనివాస్, పి.మంజులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేసారు.

గ్రామాల్లో నమస్తే డే కార్యక్రమం

విశాలాంధ్ర - డెంకాడ: డెంకాడ మండలంలోని 26 పంచాయతీలలో బుధవారం నమస్తే డే దినోత్సవం నిర్వహించారు. పెదతాడివాడ గ్రామంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి రౌతు శిరీష హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పనిచేస్తున్న శానిటేషన్ పనివారికి 20 కేజీల బియ్యం బ్యాగులు పీపీ కిట్లు వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులందరూ ఆరోగ్యంగా ఉండాలని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి శ్రీనివాసరావు, చింతపల్లి రామ్మూర్తి, కోరాడ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులు, ఆశా వర్కర్స్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

1200 కోట్లు దాటిన బూత్‌లలో అదనపు బూత్‌ల ఏర్పాటు

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి నియోజకవర్గంలో 1200 మంది ఓటర్లు దాటిన ప్రతి బూత్‌కు అదనపు కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని చీపురుపల్లి ఆర్డీవో ఆసయ్య అధికారులకు సూచించారు. చీపురుపల్లి తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చీపురుపల్లి మండలం నిమ్మలవలస పంచాయతీకి సంబంధించి చౌక్కారపాలెంలో అదనపు కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక ఎంపీటీసీ అధికారుల శ్రీనివాసరావు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వల్లిరెడ్డి శ్రీనువాసనాయుడు, మీసాల వరహాల నాయుడు, టీడీపీ నుండి గవిడినాగరాజు, రౌతు నారాయణరావు, బిజెపి నాయకులు నీలకంఠం నాయుడు మాస్టారు, జనసేన నాయకులు కోట్ల కృష్ణ, తహశీల్దార్ డి.ధర్మరాజు, ఇన్చార్జ్ ఆర్ఐ అంకమ్మ, సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: ఎరువులు అధిక ధరలకు విక్రయించకుండా కృత్రిమ కొరత సృష్టించకుండా చర్యలు తీసుకునేందుకు విజయనగరం జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు విజిలెన్స్ అధికారులు శృంగవరపుకోట మండలంలో రెండు ఎరువుల దుకాణాలపై బుధవారం దాడులు నిర్వహించారు. వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు ఎం.రామారావు, విజిలెన్స్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి.అప్పలనాయుడు, మండల వ్యవసాయ శాఖ అధికారి కే.రవీంద్ర, వ్యవసాయ సహాయకుడు కే.ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మండల పరిధిలో ఉన్న బాలాజీ ట్రేడర్స్, శ్రీ శ్రీనివాస ట్రేడింగ్ కంపెనీలలో దాడులు జరిపారు. రెండు దుకాణాలలో ఎరువులు నిల్వలు, ఈ పాస్ యంత్రంలోని అమ్మకాలను పరిశీలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - బాడంగి: మండలంలోని ముగడ శివారు ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్సై తారకేశ్వరరావు తెలిపారు. సుమారు 55 సంవత్సరాలు వయసు గల వ్యక్తి కొద్ది రోజుల కిందట మృతి చెంది పడి ఉన్నారు. ఫలితంగా మృతదేహం పూర్తిగా కుళ్ళి కుశించుకు పోయింది. మృతుడు ఆచూకీ తెలుసుకోవడం కోసం బొబ్బిలి డాగ్స్ క్యాడ్, క్యూస్ టీంతో పాటు పోలీసుల బృందం సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. ప్రాథమిక బిక్షాటన చేసుకున్న వ్యక్తి వడదెబ్బ తాకిడికి ఆ వ్యక్తి మృతి చెంది ఉంటాడని వారు అంచనాకు వచ్చారు. ముగడ వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి

విశాలాంధ్ర - విజయనగరం: నగరంలో ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ఆయన ఆదేశాలతో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, సిబ్బంది పలు దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. మార్కెట్ ప్రాంతంలో ఉన్న మూడు పెద్ద ప్లాస్టిక్ దుకాణాలు, నాలుగు చిన్న ప్లాస్టిక్ దుకాణాలపై దాడులు నిర్వహించి, 380 కేజీల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాటిని వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కు తరలించి వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ అక్టోబర్ 2 నుండి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధానికి కట్టుదిట్టమైన చర్యలు అమలు చేయబోతుందని అన్నారు.

ప్రధానమంత్రి ధన-ధాన్య కృషి యోజన పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదంపై హర్షం

విశాలాంధ్ర - రాజాం: ప్రధానమంత్రి ధన-ధాన్య కృషి యోజన పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదంపై భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, సారథి నీటి సంఘం సభ్యులు మిత్తిరెడ్డి మధుసూదనరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి వచ్చే 6 సంవత్సరాల పాటు దేశంలోని 100 జిల్లాల్లో అమలు చేయబోయే "ప్రధాన మంత్రి ధన-ధాన్య కృషి యోజన" పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. వ్యవసాయాన్ని బలోపేతం చేయడం, పంట ఉత్పత్తిని పెంచడం, మెరుగైన నీటిపారుదల సౌకర్యాలను కల్పించడం, పంటకోత తరువాత స్థానికంగా గిడ్డంగుల నిర్మాణం చేసి నిల్వ వ్యవస్థను సృష్టించడం, రైతులకు సులభంగా, అందుబాటులో ఉండే రుణాన్ని అందించడం వంటి లక్ష్యాలతో ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - బొబ్బిలి: మండలం రాజుపేట సీతయ్యపేట గ్రామాలు సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు సంబంధిత శాఖ అధికారులను డిమాండ్ చేశారు. బోర్డు లేకపోవడంతో బొబ్బిలి నుండి మక్కువ నంద వెళ్లే బస్సు కండక్టర్‌కు తెలియకపోవడంతో గోపాల రాయుడు పేట గ్రామం దాటిన తర్వాత రాజుపేట గ్రామం సూచించే బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు విశాలాంధ్రకు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

అశోక్ గజపతిని కలిసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతి రాజు ని నియమించిన కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు హర్షపూర్వకంగా స్వాగతించారు. బుధవారం నాడు

విజయనగరం లో గవర్నర్ అశోక్ గజపతి రాజుని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్పీకర్ మాట్లాడుతూ పూసపాటి అశోక్ గజపతి రాజుని గోవా గవర్నర్‌గా నియమించిన ఈ శుభవార్తతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా పండుగ వాతావరణం నెలకొంది. 1983 నుంచి ఆయనతో రాజకీయ జీవితంలో కలిసి పనిచేశామన్నారు. గోవా గవర్నర్ పదవిని కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్కి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్లుగా ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నప్పటికీ ఆయనకు అండగా నిలిచిన విజయనగరం జిల్లావాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు..

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని కారకవలస గుడివాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి పి.బాల భాస్కరరావు బుధవారం సందర్శించారు. పాటశాల పరిసరాలు తరగతి గదులు,కిచెన్ గార్డెన్, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్ మొదలగునవి పరిశీలించారు. విద్యార్దులతో తెలుగు, ఇంగ్లీషు చదివించడం, రాయించడం, చతుర్విధ ప్రక్రియలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, సిఆర్ఎంటి పాల్గొన్నారు.

నమ్మించారు..నిలువునా ముంచారు..

బాధిత రైతు రాజు ఆవేదన



విశాలాంధ్ర - చీపురుపల్లి: పేద ప్రజలకు అవసరమైన జగనన్న కాలనీ నిర్మిస్తామంటూ అప్పటి అధికారులు నమ్మబలికి నా వద్ద నుండి సుమారు నాలుగు ఎకరాల భూమిని ప్రభుత్వ ధరకు తీసుకున్న అధికారులు నమ్మించి నిలువునా నన్ను ముంచేశారని చీపురుపల్లి మండలం వంగపల్లి పేట గ్రామానికి చెందిన సాగి నారాయణ రాజు అనే రైతు బుధవారం విలేకరుల వద్ద వాపోయారు. తాజాగా చీపురుపల్లి సమీపంలో గల జగనన్న కాలనీ రోడ్డు వివాదానికి సంబంధించి వాస్తవ విషయాలను ఆయన విలేకరులకు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో జిల్లా కలెక్టర్ తో పాటు స్థానిక నాయకులు సైతం జగనన్న కాలనీకి సంబంధించి నిర్మాణాలు చేపట్టాలని, తన వద్ద గల సుమారు 4 ఎకరాల భూమిని జగనన్న కాలనీకి ఇవ్వాలంటూ తనను కోరారని ఆయన వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు తన భూమిని ప్రభుత్వానికి అప్పజెప్పిన అనంతరం ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం తనకు కొంత మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించింది అన్నారు. తన పేరుతో ప్రస్తుత వివాదంలో ఉన్న రహదారి సంబంధించి భూమిని ఇతరుల పేరుతో ప్రభుత్వ రికార్డులను తారుమారు చేసి రెవెన్యూ అధికారులు ఎటువంటి సంబంధం లేని వ్యక్తికి సుమారు 20 లక్షల రూపాయలను చెల్లించారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా విషయాన్ని తెలుసుకున్న తాను అనారోగ్యం, వృద్ధాప్యం ,కారణంగా స్థానిక నాయకులను ఆశ్రయించాను అన్నారు. 2019లో సుమారు నాలుగు ఎకరాల భూమిని ప్రభుత్వానికి జగనన్న కాలనీల నిర్మాణం కోసం అప్పగించిన తనకు అధికారులు పాలకులు, అన్యాయం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే తన భూమిని అప్పగించినప్పటికీ ప్రస్తుతం వివాదంలో నెలకొన్న రహదారికి సంబంధించి తన పేరుతో ఉన్న భూమిని వేరొకరు పేరుతో సుమారు 20 లక్షల రూపాయలు చెల్లించి అధికారులు చేతులు దులుపుకోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు జిల్లా మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదన్నారు. సుమారు నాలుగు ఎకరాల భూమిని జగనన్న ఇళ్ల నిర్మాణం కోసం అప్పజెప్పిన సమయంలో ప్రభుత్వం తనకు విడుదల చేసిన నిధులనుండి చీపురుపల్లి మండల రెవెన్యూ అధికారులకు క్రింది స్థాయి అధికారులకు వేలాది రూపాయల ముడుపులు చెల్లించినప్పటికీ తనకు న్యాయం చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జగనన్న కాలనీ రహదారి వివాదానికి సంబంధించి నిర్మాణం జరుగుతున్న సమయంలోనే అప్పటి పార్లమెంటు సభ్యులు బెల్లం చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన తెలిపారు. తన పేరుతో ఉన్న భూమి పైన వేరే ఒకరి పేరుతో సుమారు 20 లక్షల రూపాయలు ఎలా చెల్లిస్తారని దీనిపైన ఉన్నత అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ఈ ఘటనలో రికార్డులను తారుమారు చేసిన రెవెన్యూ అధికారులను శిక్షించాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు మనవి చేశారు. చీపురుపల్లి పట్టణ పరిధిలో జి అగ్రహారం సర్వే నెంబరు 102 సంబంధించి సుమారు 70 సెంట్లు భూమిపైన వివాదం నెలకూడం విచారకరమన్నారు.

ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు, పాలకులు దృశ్య సారించి తన పేరుతో మంజూరైన నిధులను రెవిన్యూ అధికారులు ఎవరికి అందజేశారో బయటకు తెలయచేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. తనకు జరిగిన అన్యాయం పట్ల జిల్లాస్థాయి ఉన్నతాధికారులు దృష్టి సారించకపోతే రాష్ట్ర స్థాయిలో అధికారులకు ఫిర్యాదులు చేసి న్యాయస్థానాన్ని సంప్రదిస్తానని ఈ సందర్భంగా రాజు హెచ్చరించారు.

ఉపాధి పనుల ప్రగతిపై సమీక్ష

విశాలాంధ్ర - రాజాం: రాజాం మండలంలో ఉపాధి పనుల ప్రగతిపై డ్వామా పీడీ శారదాదేవి బుధవారం సమీక్ష నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె పలు అంశాలపై సిబ్బందికి సూచనలిచ్చారు. సమావేశంలో ఎంపిడిఓ శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌కు అభినందనలు తెలిపిన టీడీపీ నేతలు

విశాలాంధ్ర - డెంకాడ: మాజీ కేంద్ర మంత్రి, తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు గోవా రాష్ట్రం గవర్నర్ గా నియమితులైన సందర్భంగా విజయనగరం పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కలిదిండి పాణిరాజు ఆద్వర్యంలో బుధవారం విజయనగరం ఆయన నివాసంలో టీడీపీ నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు.

జిఎంఆర్ కేర్‌లో పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - రాజాం: విధి నిర్వహణలో అనేక శారీరక, మానసిక ఒత్తిళ్లకు గురవుతున్న పోలీస్ లకు వైద్య ఆరోగ్య పరీక్షలు చాలా అవసరమని డిఎస్పి ఎస్. రాఘవులు అన్నారు. బుధవారం జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు రాజాం జిఎంఆర్ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రాజాం టౌన్, రాజాం రూరల్ పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ రాజాం జిఎంఆర్ కేర్ ఆసుపత్రి సౌజన్యంతో వైద్యపరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఇది చాలా ఉపయోగకరమైనవని చెప్పారు. వైద్య పరీక్షలు చేసేందుకు ముందుకు వచ్చిన జిఎంఆర్ కేర్ ఆసుపత్రి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. టౌన్ సిఐ కె. అశోక్ కుమార్, రూరల్ సిఐ. హనుమంతు ఉపేంద్రల ఆధ్వర్యంలో 8 మంది ఎస్ఐలు, 16 మంది ఎఎస్ఐ లు, 33 మంది హెచ్సిలు, 110 మంది పీసీ లు, 23 మంది మహిళా కానిస్టేబుళ్లు, 33 మంది హెూంగార్డులు, 11 మంది మహిళా హెూంగార్డులు, 15 మంది డ్రైవర్లు మొత్తం 250 మంది పాల్గొన్నారు. వైద్యపరీక్షలు జరగడం పట్ల వారంతా సంతోషం వ్యక్తం చేస్తూ, ఇటువంటి బృహత్తర కార్యక్రమం చేపట్టిన ఎస్పి వకుల్ జిందాల్, డిఎస్పి రాఘవులు, పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.అశోక్ కుమార్, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంతు ఉపేంద్ర లకు వారు ధన్యవాదాలు తెలిపారు.

ఉత్తమ కోఆపరేటివ్ పద్ధతులను అధ్యయనం చేస్తున్న కిమిడి నాగార్జున

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన 13 జిల్లా కోఆపరేటివ్ బ్యాంకుల చైర్మన్లుతో జిల్లా డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య డీసీసీబీలను సందర్శించారు. సహకార రంగంలో అమలు చేస్తున్న ఉత్తమ పద్ధతులను ప్రత్యక్షంగా అధ్యయనం చేయడం, వాటి అమలులో విజయవంతమైన మార్గాలను తెలుసుకోవడం ప్రధాన ఉద్దేశంగా ఈ సందర్శన కొనసాగుతుందని నాగార్జున తెలియజేశారు. బలహీన స్థితి నుండి విజయవంతమైన ప్రదర్శన వరకు అయోధ్య డీసీసీబీ మార్గయాత్ర సంస్థ ఒకప్పుడు పెద్ద మొత్తంలో నష్టాలను మూటగట్టుకున్నప్పటికీ, క్రమంగా ప్రభుత్వ సహకారం, పర్యవేక్షణలో లోపములు దిద్దుబాటు, బోర్డు, నిర్వాహకుల చిత్తశుద్ధి సహా పలు పారదర్శక విధానాల పాటించటం వల్ల నష్టాల నుండి బయటపడింది. ఈ ప్రగతికి తోడ్పడిన ముఖ్య అంశాలు ఈ సందర్శనలో చైర్మన్ లకు వివరించారు.ఆర్థిక పునరుద్ధరణకు స్వతంత్ర ప్రణాళిక రూపొందించడం,ఆదాయ మార్గాలను విస్తరించడం ,సంక్షేమ పథకాలను వినియోగదారులకు సమర్థంగా చేరవేయడం ప్రభుత్వ సహకారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పునరుద్ధరణకు తగిన నిధుల వినియోగం, ప్రతినిధులు ప్రభుత్వ మద్దతుతో బలోపేతంపై ప్రత్యేకంగా అవగాహన పొందుతూన్నామని నాగార్జున తెలిపారు.

అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో ఖాళీ సీట్లకు కౌన్సిలింగ్

జిల్లా కలెక్టర్ డా. బి.ఆర్. అంబేద్కర్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : జిల్లాలోని డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలు/కళాశాలల్లో 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు ఖాళీగా ఉన్న సీట్లకు అడ్మిషన్ కౌన్సిలింగ్ 2025 జూలై 19వ తేదీ శనివారం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. బి.ఆర్. అంబేద్కర్ తెలిపారు. నెల్లిమర్ల గురుకుల పాఠశాల/కళాశాలలో కౌన్సిలింగ్ జరుగుతుందని, జిల్లాలోని ఎనిమిది గురుకుల పాఠశాలల్లో మొత్తం 983 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఖాళీల వివరాలు

5వ తరగతి: 238 సీట్లు,6వ తరగతి: 57 సీట్లు, 7వ తరగతి: 46 సీట్లు,8వ తరగతి: 23 సీట్లు, 9వ తరగతి: 16 సీట్లు10వ తరగతి: 61 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం 257 సీట్లు, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం285 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి గల ఎస్.సి, ఎస్.టి బాల బాలికలు 2025 జూలై 19వ తేదీ (శనివారం) నెల్లిమర్ల పాఠశాలలో జరిగే కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. బాలికలు ఉదయం 9:00 గంటలకు, బాలురు మధ్యాహ్నం 1:00 గంటలకు హాజరు కావాలన్నారు. డా. బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో మంచి వాతావరణం, భోజనం, వసతి అనేక ఇతర సదుపాయాలు ఉన్నాయని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్చాలని ఆయన కోరారు.

నిర్వాసితులకు అండగా ఉంటాం

శాసనమండలి మాజీ పిడిఎఫ్ నేత విఠల బాలసుబ్రమణ్యం

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: జిందాల్ కంపెనీని నమ్మి భూములు ఇచ్చిన రైతు ఒప్పందాలు అమలు కాలేదని నిత్యం ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం వెంటనే స్పందించాలని, శాసనమండలి మాజీ ప్రోటోం స్పీకర్, శాసన మండల లో పిడిఎఫ్ పక్ష నేత విటలపు బాలసుబ్రమణ్యం కోరారు. బుధవారం బొడ్డవరలో పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ విఠలపు బాలసుబ్రమణ్యం నిర్వాసితులు వద్దకు వచ్చి మాట్లాడుతూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మీకు అండగా ఉంటారని తెలిపారు మీరు చేస్తున్న పోరాటంలో న్యాయం ఉన్నందున విజయం సాధించే వరకు పోరాటం కొనసాగించాలన్నారు. కంపెనీ కోసం తీసుకున్న భూముల్లో 18 సంవత్సరాల కావస్తున్న కంపెనీ కట్టనందున చట్టం ప్రకారం రైతుల భూములు రైతులకు దక్కాలన్నారు. రాష్ట్రమంతటా రైతుల భూములను కంపెనీల పేరుతో బడా సంస్థలకు అప్పగించడం, లేదా ధారాధత్వం చేయడం అన్యాయమన్నారు. ఎమ్మెల్సీ రఘు రాజు మాట్లాడుతూ నిర్వాస్తులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి అనుమతులు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. ఆరోజు నేను భూములు ఇవ్వమని చెప్తేనే ఈ ప్రాంత రైతులందరూ జిందాలకు భూములు ఇచ్చారని ఇప్పుడు అదే రైతులకు అన్యాయం జరిగితే నిర్వాసితుల తరవున పోరాడేందుకు దేనికైనా తెగిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లా జగన్, మాజీ ఎంపీపీ వంటి అప్పారావు పాల్గొన్నారు.

బిఎల్‌ఓలు విధులు సక్రమంగా నిర్వర్తించాలి

విశాలాంధ్ర - బొబ్బిలి : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బొబ్బిలి నియోజకవర్గం పరిధిలో నాలుగు మండలాల బూత్ స్థాయి అధికారులు శిక్షణా తరగతులను ఈనెల 9 నుండి ప్రారంభించి ఇంతవరకు బొబ్బిలి మండలం లో ఉన్న బూత్ స్థాయి అధికారులు ఈనెల 11, 12. 15 తేదీలలో. నాలుగు రోజులుగా 202 మందికి శిక్షణ తరగతులు ఇప్పటికే పూర్తి చేసినట్లు ఈఆర్‌ఓ రెవెన్యూ డివిజనల్ అధికారి రామ్మోహన్ రావు తెలిపారు. ఐదవ బుధవారం పోలింగ్ కేంద్రం నెంబరు 203 నుండి 252 వరకు ఉన్న తెర్లాం మండలం బూత్ స్థాయి అధికారులుకు శిక్షణ తరగతులు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి అర్హులైన ఓటరులు దగ్గర నుండి ఫారం 6 క్లైములను సేకరించవలెను. అదేవిధంగా చనిపోయిన మరియు శాశ్వత బదిలీలు ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిపోయిన ఓటర్లు జాబితా నుండి తొలగించుటకు ఫారం 7 ద్వారా చర్యలు తీసుకోవాలని కోరారు. మరియు జాబితాలో ఉన్న వివరాల్లో తప్పులు ఉన్న ఎడల సవరణలు చేయుటకు ఫారం 8 ద్వారా సవరణ చేయవలెనని మరియు ఎన్నికల సంఘం నియమ నిబంధన ప్రకారం విచారణ నిర్వహించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. బూత్ లెవెల్ స్థాయి అధికారులు ఉద్యోగం పట్ల చాలా బాధ్యతయుతంగా వ్యవహరించాలని అదేవిధంగా ఓటర్ల పట్ల గౌరవప్రదంగా వ్యవహరించాలని ఆదేశించారు. త్వరలో జరగబోవు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం సజావుగా జరిగేటట్టు చూడాలని కోరారు.భవిష్యత్తులో జరగబోవు స్థానిక సంస్థల ఎన్నికల పట్ల చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సమయస్ఫూర్తితో ఉద్యోగం చేయాలని హితువు పలికారు.ఈ కార్యక్రమం లో , తెర్లాం మండలం ఏఈఆర్‌ఓ తహసిల్దార్, జీ. హేమంత్ కుమార్ , నియోజకవర్గ ఎన్నికల ఉప తహసిల్దార్ బలివాడ గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తున్న కూటమి

ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావు

విశాలాంధ్ర - చీపురుపల్లి: ఎన్నికల ముందు ఓటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అంచలంచలుగా పూర్తిస్థాయిలో అమలు చేస్తుందని చీపురుపల్లి శాసనసభ్యుడు మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకట్రావు అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలో జి అగ్రహారం నందు జరిపిన పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆయన ప్రారంభోత్సవాలు చేశారు.. అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కాలంలో చేసిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన కరపత్రాలను అందజేశారు.. ప్రభుత్వ అమలు జరిపిన పథకాలు అందుతున్నాయా లేదా అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. చీపురుపల్లి మండలం,చీపురుపల్లి పంచాయతీ జి.అగ్రహారం గ్రామంలో పర్యటించి "సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జి.అగ్రహరం గ్రామంలో రూ. 20.30 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డులు మరియు కాలువలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు, ఇచ్చర్లపాటి త్రిమూర్తులు రాజు గద్దె బాబురావు రౌతు కామునాయుడు, వలి రెడ్డి శ్రీరాములు నాయుడు, గవిడి నాగరాజు, రౌతు నారాయణరావు, రౌతు రమేష్ నాయుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ బస్సులు తీసుకువచ్చేందుకు కృషి

ప్రజారోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ ద్వారక తిరుమలరావు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఎలక్ట్రికల్ బస్సులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాబోతున్నమహిళా ఉచిత బస్సులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ ద్వారక తిరుమలరావు అన్నారు. బుధవారం ఆర్టీసీ కాంప్లెక్స్ కు విచ్చేసిన ఆయన ముందుగా కాంప్లెక్స్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.అక్కడే ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం జరిగిన ఉత్తమ ఉద్యోగుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రోడ్డు రవాణా సంస్థలో ఉత్తమ ఉద్యోగులుగా గుర్తింపు తెచ్చుకున్న వీరందరికీ అభినందనలుతెలుపుతున్నామన్నారు రానున్న కాలంలో ప్రభుత్వం మహిళలకు కల్పించే ఉచిత బస్సు ప్రయాణం కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. దీనికొరకు ఎలక్ట్రికల్ బస్సులను అందుబాటులోకి తీసుకు వస్తున్నామన్నారు ప్రస్తుతం నడుపుతున్న బస్సులను కూడా ఎలక్ట్రికల్ బస్సులుగా మార్చుటకు ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రయాణికుల సౌకర్యార్థం పల్లెవెలుగు బస్సులను పెంచుతామన్నారు.మహిళా ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యంలతో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జోన్1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి అప్పలనాయుడు ప్రజారవాణా శాఖ అధికారులు జ.సత్యనారాయణ , అరుణకుమార్ , దుర్గ ప్రసాద్, జిల్లా ప్రజా రవాణా అధికారి జి. వరలక్ష్మి . జె శ్రీనివాస రావు, ఆర్టీసీ కార్మిక నాయకులు. పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న అశోక్ కుటుంబ సభ్యులు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఇటీవల గోవా గవర్నర్ గా నియమితులైన మాజీ కేంద్ర మంత్రి,మాన్సాస్ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు , సునీల గజపతి దంపతులు, కుమార్తె,స్థానిక ఎమ్మెల్యేఅదితివిజయలక్ష్మిగజపతి బుధవారం పూసపాటి వంశీయులఇలవేలుపు శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శించుకునేందుకు చదురు గుడికి విచ్చేసారు. దేవస్థానం ఇఓ కె.శిరీష వారికి మంగళవాయిద్యాలనడుమ వేదపండితులు పూర్ణకుంభం స్వాగతం పలికారు.ఆలయంలో పైడితల్లి అమ్మవారికి పూజలు నిర్వహించుకున్నారు. ఆలయసాంప్రదాయాను సారం అశోక్ గజపతిరాజు కు అర్చకులు తలపాగా అలంకరించారు. కుటుంబసమేతంగా విచ్చేసిన ఆ దంపతులకు, సభ్యులకు వేదపండితులు వేదాశీర్వాదం చేసారు.దేవస్థానంఇఓ శిరీష అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఈకార్యక్రమంలో దేవస్థానం వేదపండితులు, అర్చకులు , సీనియర్ సూపరింటెండెంట్ అసిస్టెంట్ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నగర వ్యాప్తంగా ఫీవర్ సర్వే

విశాలాంధ్ర -విజయనగరం: నగర వ్యాప్తంగా ఫీవర్ సర్వే ప్రక్రియ జరుగుతుంది. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో హెల్త్ కార్యదర్శులు,ఏఎన్ యం లు సంయుక్తంగా ఫీవర్ సర్వే చేపడుతున్నారు. సచివాలయాల పరిధిలో ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరిని పరీక్షించి జ్వర పీడితులు ఉన్నారా లేదా అన్న విషయాన్ని అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. దీనిపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఫీవర్ సర్వేలను చేపడుతున్నట్లు చెప్పారు. సాధారణ జ్వరం మూడు రోజులు వరకు ఉంటుందని, అదే వైరస్ సోకిన జ్వరం అయితే తక్షణమే వైద్యుణ్ణి సంప్రదించాలని చెప్పారు. అంటువ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆహార పదార్థాలపై మూతలను తప్పనిసరిగా ఉంచాలన్నారు. ఈగలు, దోమలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఫీల్డ్ అసిటెంట్లు పనితీరు మెరుగుపరచుకోవాలి

విశాలాంధ్ర - వంగర: ఫీల్డ్ అసిటెంట్లు పనితీరు మెరుగు పడాలని, మీ ఫెయిల్యూర్ వల్ల వంగర మండలం ఉపాధిహామీ పథకం అభివృద్ధిలో వెనుకబడి ఉందని, మీ పనితీరు మెరుగు పరచిన నాడే మండలం ఉపాధిహామీ పనుల్లో ముందుంటుందని జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్ట్ ఎస్.శారదా దేవి ఫీల్డ్ అసిటెంట్లుకు ఆదేశాలు జారీచేశారు. బుధవారం ఆమె వంగర మండల పరిషత్ సమావేశ మందిరంలో ఫీల్డ్ అసిటెంట్లు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఫీల్డ్ అసిటెంట్లు నిర్లక్ష్యం, పనితీరు లోపం వల్లనే ఈనాడు వంగర మండలం జిల్లాలో రెండేళ్లుగా వెనుకబడిందని, వెనుకబడిన ఈ మండలాన్ని ముందుకుతీసుకెళ్లాలని ఆదేశించారు. ప్రకృతి వనరులను పరిరక్షించుకోవాలని ప్రతీ గ్రామంలో ప్రతీ ఫీల్డ్ అసిటెంట్ ప్రకృతి వనరులను చిన్న,సన్న కారు రైతులకు ఉపయోగపడేవిధంగా నేల నీరు తదితర వనరులను ఉపయోగ పడేవిధంగా ఉపాధిహామీ పథకం ద్వారా తయారు చేసుకొనే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపివో ఎం.సత్యవతి, ఇంచార్జ్ ఈ సి, ఉపాధిహామీ సిబ్బంది,ఫీల్డ్ అసిటెంట్లు పాల్గొన్నారు.

నేటి నుండి బాబు షూరిటీ మోసం గ్యారంటీ

విశాలాంధ్ర - వేపాడ: వేపాడ మండలంలో గురువారం నుండి బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వైసీపీ మండల అధ్యక్షులు మాములూరి జగ్గు బాబు తెలిపారు. 17న వేపాడ గ్రామంలో, 18న శుక్రవారం సాయంత్రం 5లకు వల్లంపూడిలో 19న శనివారం ముకుందపురం,ఓబలయ్యపాలెం, బొద్దాం,పాటూరు, అర్.ఎస్.పేట, పి.కే.అర్.పురం, కే. జి.పూడి గ్రామాలలో 20న ఆదివారం సోంపురం, అరిగిపాలెం,జగ్గయ్యపేట, సింగరాయి,ఏ.ఎస్.పేట,ఆతవ గ్రామాల్లో 21న సోమవారం డి.ఆర్.పేట, కరకవలస, చామలాపల్లి, జాకేరు,గుడివాడ గ్రామాల్లో 22న మంగళవారం వీలుపర్తి,వావిలపాడు,నల్లబిల్లి,చిన గుడిపాల, ఏన్. కే. అర్. పురం గ్రామాలలో 23న బుధవారం బల్లంకి, బానాది,కుమ్మపల్లి, కే.అర్.పేట గ్రామాల్లో నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమాలపై ఆయా గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని అయన పిలుపునిచ్చారు.